

మోరీల్ శ్రీనివాస్ దంపతులకు ఘనంగా పెళ్లిరోజు శుభాకాంక్షలు.. బామ్మవాడ ప్రజల నుంచి అభినందనల వెల్లువ

జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

WANTED

సమాజంలో ప్రజాధారణ పొందుతున్నజన సంఘర్షణ దిన పత్రికలో పని చేయుటకు మండల. జిల్లా స్థాయిలో రిపోర్టర్స్ కావలెను.అనుభవం కలవారికి ప్రాధాన్యత కలదు, కొత్తవారికి అవకాశం కలదు

నిజామాబాద్ | ఆదివారం 1 - 11 - 2026 | సంపుటి : 03 | సంచిక : 268 | పేజీలు : 8 | వెల రూ. 8.00/- | ఎడిటర్ : రాచమల్లు మాధవి

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor

'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యమా..?

- రాప్తాడు ఘటనపై జగన్ తీవ్ర స్పందన
- విద్యార్థినులపై దాడిని ఖండించిన జగన్
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్న జగన్
- పాఠశాలల్లో భద్రతా వైఫల్యంపై విమర్శలు
- తరగతి గదిలోకి చొరబడి విద్యార్థినులపై దాడి
- దాడిని అడ్డుకోబోయి గాయపడిన మరో విద్యార్థిని
- రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వ ప్రాధాన్యమన్న జగన్
- గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని విజ్ఞప్తి
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని జగన్ డిమాండ్
- పాఠశాలల్లో భద్రతా విధానాలను సమీక్షించాలని కోరిన జగన్
- ఘటనకు చంద్రబాబు, నారా లోకేశ్ బాధ్యత వహించాలన్న జగన్

రాప్తాడు ఘటనపై వైసీపీ చీఫ్ జగన్ మోహన్ రెడ్డి విమర్శలు

ఆంధ్రప్రదేశ్, జన సంఘర్షణ :

అనంతపురం జిల్లాలోని రాప్తాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థినులపై జరిగిన దాడిపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. ఈ సంఘటన రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు, జంగిల్‌రాజ్‌కు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. విద్యాసంస్థల్లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో భద్రతా విధానాలను అత్యవసరంగా సమీక్షించాలని ఆయన కోరారు. ఈ దారుణ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలోని రాప్తాడు జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థినులపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతుంది. ఈ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. క్లాస్‌రూమ్‌లో విద్యార్థులంతా చూస్తుండగానే ఓ దుండగుడు చొరబడి చెట్లను నరికే యంత్రంతో విద్యార్థినులపై దారుణంగా దాడి చేశాడు. పోలీసులు నిందితుడు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ ఘటనపై మాజీ సీఎం, వైసీపీ చీఫ్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు, జంగిల్‌రాజ్‌కు ఈ సంఘటన అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలోకి ఓ ది







చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక

కన్నీళ్లు ఆగడం లేదు

ఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రులు దిగ్భ్రాంతి, కఠిన చర్యలకు ఆదేశాలు

రాప్తాడులో బాలికపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి లోకేశ్

ఆడపిల్లల భద్రతకు భంగం కలిగిస్తే ఉక్కుపాదంతో అణిచేస్తామని హెచ్చరిక

పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన ఉన్మాది

ధర్మవరం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆంధ్రప్రదేశ్, జన సంఘర్షణ :

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది," అని ఆయన అన్నారు. ఆడపిల్లలు, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మహిళల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..: రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నేరుగా పదో తరగతి గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న విద్యార్థినిపై చెట్ల కొమ్మలు నరికే రంపంతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దుండగుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా

ఖనిజ సంపదే లక్ష్యమా?

- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతంపై ఆందోళన
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎమర్జెన్సీ విధింపు
- ప్రావిన్స్ ఖనిజ సంపదను చేజిక్కించుకునేందుకే ఈ చర్యలని అనుమానాలు
- ఈ చర్యలతో తీవ్రవాదానికి ఆయుధం ఇచ్చినట్లవుతుందని హెచ్చరించిన నివేదిక

అంతర్జాతీయం, జన సంఘర్షణ :

పాకిస్తాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే జన సంఘర్షణ తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక



వైసీపీకి స్థానిక ఎన్నికల్లోనూ బుద్ధి చెప్పాలి

గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాసిందన్న అశోక్ బాబు

రివర్స్ పీఆర్సీ, సీపీఎస్ రద్దులో మోసం చేశారని విమర్శ

ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపణ

టీడీపీ ప్రభుత్వమే ఉద్యోగులకు అండగా నిలిచిందని వెల్లడి

స్థానిక ఎన్నికల్లో వైసీపీని ఉద్యోగులు తిరస్కరించడం ఖాయం

ఆంధ్రప్రదేశ్, జన సంఘర్షణ :

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, వారి సంక్షేమాన్ని కాలరాసిన ఆ పార్టీకి ఇప్పుడు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించి ఉద్యోగం నుంచి డిస్మిస్ అయిన ఓ మాజీ ఉద్యోగ సంఘ నాయకుడు, రాబోయే స్థానిక



చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు

కూటమి దుర్మార్గాలతో ఏకగ్రీవాలు సాధిస్తోందని పేర్ని నాని ఆరోపణ

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శ

బీసీ రిజర్వేషన్లలో అన్యాయం.. దళితులకు ఎంపీపీ సీట్లు లేవని ఆరోపణ

మున్సిపల్ ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు పూర్తి



ఆంధ్రప్రదేశ్, జన సంఘర్షణ :

రేపు మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని అధికార కూటమి దుర్మార్గాలకు పాల్పడుతోందని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... తప్పుడు మార్గాల్లో ఏకగ్రీవాలు సాధించి, కూటమి బలంగా ఉందని చూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని

‘రెడ్ బుక్’ పాలనకే ప్రాధాన్యమా..?



దుండగుడు యథేచ్ఛగా చొరబడి ఇంతటి ఘాతుకానికి పాల్పడటం విద్యాసంస్థల్లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని ఆయన విమర్శించారు. “విద్యా సంస్థల్లో పిల్లలకు తగిన భద్రత కల్పించడంలో వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్యానికి ఈ ఘటన ఒక నిదర్శనం. ఆ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడడం అత్యంత దురదృష్టకరం” అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్‌లో పేర్కొన్నారు. అలాగే దాడిని అడ్డుకోబోయిన మరో విద్యార్థిని సైతం గాయపడటం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసి, ‘రెడ్ బుక్’ పాలన పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా చెలరేగిపోతున్నారని జగన్ ఆరోపించారు. అదే విధంగా గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని పాఠశాలల్లో భద్రతా విధానాలను అత్యవసరంగా సమీక్షించాలని ఆయన కోరారు. ఈ దారుణ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

రాప్తాడు దాడి ఘటన.. హెచ్ఎం సస్పెన్షన్ వార్తలపై కలకలం



ఆంధ్రప్రదేశ్ : అనంతపురం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమానుష దాడి నేపథ్యంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి సస్పెన్షన్‌కి గురైన వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై హెచ్ఎం రాజేశ్వరి కుమారుడు సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. తన తల్లి సస్పెన్షన్ వార్తలను ఆయన పూర్తిగా ఖండించారు. ఈ ఘటనలో ఏ టీచర్ ప్రమేయం గానీ, వైఫల్యం గానీ లేదని, దయచేసి ఫేక్ న్యూస్ ప్రచారం చేయడం ఆపండంటూ ఆయన ఘాటుగా ట్వీట్ చేశారు. అనంతపురం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన అమానుష దాడి ఘటనకు సంబంధించి విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరిని సస్పెండ్ చేసిందనే వార్తలు వచ్చాయి. పాఠశాలలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రతిపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్కూల్ హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఈ వార్తలపై హెచ్ఎం రాజేశ్వరి కుమారుడు సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. తన తల్లి సస్పెన్షన్ వార్తలను ఆయన పూర్తిగా ఖండించారు. “రాప్తాడు హైస్కూల్ హెడ్ మాస్టర్ మా అమ్మ. కేవలం కుటుంబ వివాదాలు, కుట్రల వల్లే ఈ దాడి జరిగిందని డీఈవో (ఇంఛార్జి) తన రిపోర్ట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నేను స్వయంగా డీఈవో, డీవైఈవో పక్కనే మూడు గంటల పాటు ఉన్నాను. మాకు సస్పెన్షన్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం గానీ, ఆదేశాలు గానీ రాలేదు. ఈ ఘటనలో ఏ ఉపాధ్యాయుడి ప్రమేయం గానీ, వైఫల్యం గానీ లేదు. దయచేసి ఫేక్ న్యూస్ ప్రచారం చేయడం ఆపండి” అంటూ ఆయన ఘాటుగా ట్వీట్ చేశారు. ఒకవైపు భద్రతా వైఫల్యంపై విద్యాశాఖ చర్యలు తీసుకుందనే వార్తలు వస్తుండగా.. మరోవైపు ఇది కేవలం కుటుంబ కుట్రల నేపథ్యమేనని, సస్పెన్షన్ వార్తలు అవాస్తవమని హెచ్ఎం కుటుంబ సభ్యులు వాదిస్తుండడంతో గందరగోళం నెలకొంది. దీనిపై విద్యాశాఖ అధికారులు అధికారిక ప్రకటన చేస్తే తప్ప పూర్తి స్పష్టత వచ్చే ఛాన్స్ లేదు. అయితే ఈ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై సర్వాత్ర ఆందోళన వ్యక్తమవుతుంది. కాగా రాప్తాడు జడ్పీ హైస్కూల్లో ఓ దుండగుడు చొరబడి పదో తరగతి విద్యార్థినులపై దాడి చేశాడు. చెట్లను నరికే యంత్రంతో దాడి చేయడం వల్ల ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో ఇంకో అమ్మాయి కూడా గాయపడింది. గాయపడిన వారికి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కూడా నిందితుడి హేమంత్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పులివెందులలో తిరిగేందుకు నో పర్మిషన్



ఆంధ్రప్రదేశ్ : మాజీ సీఎం, పులివెందులలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకునే స్వేచ్ఛ, అధికారం ఆయనకు ఉన్నాయని డీఐజీ కోయ ప్రవీణ్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో ఎన్నికల సామగ్రి పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు వేసిన తర్వాత పులివెందుల పట్టణంలో తిరిగేందుకు జగన్ మోహన్ రెడ్డికి అనుమతి లేదని డీఐజీ కోయ ప్రవీణ్ అన్నారు. ఆయన చట్టాలు ఉల్లంఘించి తిరుగుతారని తాము అనుకోవడం లేదని, అలాగే ఆయన కోసం కూడా భద్రతా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఎవరైనా పులివెందులలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఐజీ వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సన్నాహాలు చేశామని, పులివెందుల, జమ్మలమడుగు, కడపలో అదనపు బలగాలతో బందోస్తును ఏర్పాటు చేసినట్టు డీఐజీ వెల్లడించారు. అలాగే ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది పోలీసు బలగాలను మోహరించినట్టు చెప్పారు.

పులివెందులలో ఓటు వేస్తానంటూ వైఎస్ జగన్ ప్రకటన... : కాగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పులివెందులలో తాను ఓటు హక్కును వినియోగించుకుంటానని ఇప్పటికే ప్రకటించారు. ఎవరూ ఆపుతారో చూస్తానని ప్రత్యర్థులకు సవాల్ కూడా చేశారు. అలాగే పోలింగ్ రోజున తాను అక్కడే ఉంటానని వైసీపీ స్థానిక నాయకులకు ధైర్యం చెప్పారు. అయితే జగన్ మోహన్ రెడ్డి చేసిన ఈ ప్రకటన ఏపీ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది.

పులివెందుల ఎన్నికలపై వైసీపీ అనుమానాలు ... : పులివెందుల స్థానిక ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే వైసీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేయడానికి తెలుగు దేశం పార్టీ కుట్ర పన్నుతోందని ఎంపీ అవినాశ్ రెడ్డి ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో అధికార బలంతో అడ్డదారిలో గెలించేందుకు టీడీపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అలాగే ఈ విషయలో స్థానిక పోలీసులు పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాగే పోలీసులు ఉద్దేశపూర్వకంగానే వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపణలు చేశారు. ఏదిఏమైనా ఏపీ మున్సిపల్ ఎన్నికల సమయంలో పులివెందుల రాజకీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు కేంద్రంగా మారింది. పోలింగ్ రోజు అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి.

వైసీపీకి స్థానిక ఎన్నికల్లోనూ బుద్ధి చెప్పాలి

సంస్థల ఎన్నికల్లో వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఉద్యోగుల వ్యతిరేకతే వైసీపీ ఓటమికి కారణం : “ఉద్యోగ సంఘ నాయకుడిగా ఉంటూ వైసీపీ పంచన చేరినందుకే ఆయన్ను ప్రభుత్వం డిస్మిస్ చేసింది. ఇప్పుడు వైసీపీ తరపున మాట్లాడటానికి ఆయనకు ఏ నైతికత ఉంది? రాష్ట్రంలో ఒక్క ఉద్యోగి అయినా వైసీపీకి ఓటు వేసే పరిస్థితి ఉందా? 2024 ఎన్నికల్లో 95 శాతానికి పైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేయడం వల్లే ఆ పార్టీ 11 సీట్లకు పరిమితమైంది” అని అశోక్ బాబు అన్నారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి మోసం చేశారని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రివర్స్ పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులను నట్టేట ముంచారని ఆరోపించారు. ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను సైతం దారి మళ్లించి వాడుకున్నారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు.

టీడీపీ హయామే స్వర్ణయుగం : ఉద్యోగుల సంక్షేమంలో వైసీపీ ప్రభుత్వానికి, టీడీపీ ప్రభుత్వానికి నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందని అశోక్ బాబు అన్నారు. “రాష్ట్ర విభజన తర్వాత రూ.15,000 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నా, చంద్రబాబు ఉద్యోగులకు 43% ఫిట్‌మెంట్ ఇచ్చారు. అమరావతికి వచ్చిన ఉద్యోగులకు ఉచిత వసతి, వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించారు. దేశంలోనే తొలిసారిగా సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ అమలు చేసింది టీడీపీ ప్రభుత్వమే” అని ఆయన వివరించారు.

అడుగడుగునా ఉద్యోగులను వేధించిన వైసీపీ : జగన్ పాలనలో ఐదేళ్లపాటు ఉద్యోగులను అడుగడుగునా వంచించారని అశోక్ బాబు విమర్శించారు. “ఉద్యోగ సంఘాలకు కనీస గౌరవం ఇవ్వలేదు. తమకు అనుకూలమైన సంఘాలతోనే రహస్యంగా మాట్లాడి రివర్స్ పీఆర్సీని బలవంతంగా రుద్దారు. హక్కుల కోసం పోరాడిన వారిపై కేసులు పెట్టారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి వారి గౌరవాన్ని మంటగలిపారు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్ ప్రీమియం వసూలు చేసి, ఆసుపత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో వేలాది మంది వైద్యం అందక ఇబ్బంది పడ్డారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే భరోసా : వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు దాదాపు రూ.40,000 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లిందని, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందులో ఇప్పటికే రూ.28,000 కోట్లు చెల్లించిందని అశోక్ బాబు తెలిపారు. “నిలిచిపోయిన సీపీఎస్ ప్రభుత్వ వాటాను రూ.5,000 కోట్లు జమ చేసి, దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టాం. రెండు డీఏలు విడుదల చేశాం. ఇప్పుడు ఒకటో తారీఖునే అందరికీ జీతాలు, పెన్షన్లు అందుతున్నాయి” అని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఏ ప్రభుత్వం మేలు చేసిందో ఆలోచించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని పూర్తిగా తిరస్కరించాలని అశోక్ బాబు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పిలుపునిచ్చారు. వైసీపీ నేతలకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

ఖనిజ సంపదే లక్ష్యమా?



ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ‘గ్రీక్ సిటీ టైమ్స్’ ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది. పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది. దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కన్నీళ్లు ఆగడం లేదు

భయాందోళనలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు : ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ధర్మవరం వైపు పారిపోతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాధితురాలికి అతను దగ్గరి బంధువేనని స్థానికులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి : ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత అమానుషమైన చర్య అని పేర్కొన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించి, బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.




చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు

విమర్శించారు. “రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. చంద్రబాబే అన్నీ గెలిచారని బిల్డప్ ఇచ్చుకోవడం కోసమే ఈ దుర్మార్గాలు చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు” అని పేర్ని నాని మండిపడ్డారు. బీసీ కుల గణన చేపట్టకుండా, ఓట్లు తక్కువగా ఉన్నాయని చూపిస్తూ రిజర్వేషన్లలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పలు మండలాల్లో దళితులకు ఎంపీపీ సీట్లు రిజర్వ్ చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో పేర్ని నాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని వైసీపీ నేతలు అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు, వైసీపీ నేతలే హింసను ప్రేరేపిస్తున్నారని టీడీపీ ఎదురుదాడి చేస్తోంది. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



దేశ పునర్నిర్మాణమే ధ్యేయంగా. అఖండ భారతమే ఆశయంగా.

ఆటంకాలకు చెలించని వజ్ర సంకల్పంతో దేశాన్ని ఖండితం కాకుండా కాపాడిన ఉక్కుమనిషి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(జన సంఘర్షణ) : సంస్థానాలన్నింటినీ దేశంలో విలీనం చేసిన మహా సాహసి... ఆటంకాలెన్ని ఎదురైనా... మొక్కవోని దీక్షతో దేశం కోసమే పని చేసిన ప్రజల మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతి పురస్కరించుకొని "రాష్ట్రీయ ఏక్తా దివస్" సందర్భంగా ఆ మహానీయుడికి నమస్సుమాంజలులు. ప్రజలందరికీ జాతీయ ఐక్యతా దినోత్సవ శుభాకాంక్షలు. రాగి రాములు బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ బిజెపి మెదక్ జిల్లా.

తొనిగండ్ల లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన గ్రామ సర్పంచ్ మల్లన్న శివకుమారి నాగులు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(జన సంఘర్షణ) : మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో పిఎస్ఈఎస్ సెంటర్లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ మల్లన్న గారి శివకుమారి నాగులు, ఉప సర్పంచ్ దుర్గయ్య, గ్రామపంచాయతీ సెక్రటరీ మౌనిక,వార్డ్ మెంబర్స్ బాలకృష్ణ, సుజాత, భాను, రమేష్,రైతులు,మాజీ సర్పంచ్ లు పెగుడ సిద్ధిరాములు,పిట్ల శ్యామయ్య, రైతులు,శంకర్, భూపాల్,చంద్రశేఖర్,సత్తయ్య లంబాడి పద్మ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(జన జనసంకర్షణ) : మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ గుగులోత్ రవి, పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, విప్లవ్, బాబు,శంకర్, భాస్కర్, స్వామి,సత్యం,నరేష్, యాదగిరి, రమేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

రామాయంపేటలో ప్రభుత్వ భూములపైనా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను

ప్రభుత్వానికి కేటాయించిన 10 శాతం భూముల విక్రయాలపై ఆరోపణలు!



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(జన సంఘర్షణ) : రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేట్ వెంచర్లలో ప్రభుత్వానికి కేటాయించిన 10 శాతం భూములపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వెంచర్లకు అనుమతులు పొందే సమయంలో ప్రభుత్వానికి కేటాయించిన భూములను సైతం కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి రిజర్వ్ చేసిన భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అధికారులు స్పందించాలి.. సమగ్ర విచారణ జరపాలి! ప్రభుత్వానికి కేటాయించిన భూముల వివరాలను అధికారులు పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగాయా లేదా అన్న విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడి, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు





- **ఇందిరా గాంధీ ఆశయాలను సాధిస్తాం.**
- **పీసీసీ జెనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్.**
- **జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళికృష్ణ.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,అక్టోబర్ 31(జనసంఘర్షణ): చర్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళికృష్ణ మాట్లాడుతూ,దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ ప్రధానిగా ఆమె తీసుకున్న పలు కీలక నిర్ణయాలు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ఐక్యత, ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇందిరా గాంధీ దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. ఆమె చూపిన మార్గంలో పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు మాట్లాడుతూ, ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు, ఆమె చూపిన నాయకత్వ పటిమ ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సీనియర్ లీడర్ మడకం పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేపూడి భాస్కర్ రావు,పుగాకు సతి బాబు, నూపా కృష్ణ, సీనిగీరి సుధాకర్, ముపిడి రమేష్,మేడి రమేష్, కారం సుధాకర్,ఎనూటి గిరి బాబు భాస్కర్, మేడి స్వరూప్,మహిళ కాంగ్రెస్ ఎస్సి సెల్ నాయకురాలు, అనుబంధ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

దశిలి రైతులపై ఫారెస్ట్ దౌర్జన్యాలు ఆపాలి

- **దశిలి పంట నష్టం చేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి.**
- **దశిలీ రైతుల జోలికొస్తే ఊరుకోం.**
- **బోడెంకి చందు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డిమాండ్.**



మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, అక్టోబర్ 31(జనసంఘర్షణ): చెన్నూరు సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు , సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ, చెన్నూరు, కోటపల్లి, కన్నెపల్లి మండలం ఉన్న పట్టు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దశిలి రైతులు 1950 నుంచి పట్టుపురుగుల పెంపకం జరుగుతుందని, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన ఆదివాసీలను అడవి నుంచి దూరం చేయాలనీ చట్టాలు తీసుకువస్తూ, పెట్టుబడిదారులకు, బడా కార్పొరేట్ సంస్థలకు, అడవులను అప్పజెప్పేందుకు పట్టుపురుగులను పెంచుకునీ జీవనం సాగిస్తున్న ఆదివాసీ లపై, దాడులు, దౌర్జన్యాలు, చేసి, వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ, పేదల పైన జులుం చేస్తున్నారు. ఆదివాసీలపై ఇంత నిర్బంధం జరుగుతున్న ప్రజా ప్రతినిధులు అధికారులు , నోరు మెదపకపోవడం సిగ్గుచేటు. దశిలి రైతుల పంటలను నష్టపరిచిన అటవీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని,దశిలి రైతుల తరతరాలుగా పట్టు పరిశ్రమపై ఆధారపడుతున్న ఆదివాసీల పై దాడులు హేయమైన చర్యల పైన పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమా జిల్లా కమిటీ సభ్యురాలు, కృష్ణమాచారి మండల కార్యదర్శి, సిపిఎం పార్టీ నాయకులు శ్రీనివాస్, తుమ్మ రేణుక, నాగజ్యోతి, యామిని, రాజేశ్వరి, మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ఉన్నా.. ఆపదలో ఉన్న నియోజకవర్గ ప్రజలకు నేనున్నానంటూ భరోసా

- **బీజేపీ కార్యకర్త కుటుంబానికి పెద్దన్నలా అండగా చీ=X కోనేరు శశాంక్**
- **రూ.5 వేల ఆర్థిక సహాయం.. పిల్లల చదువులకు జీవితాంతం అండగా ఉంటానని హామీ**



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31 (జన సంఘర్షణ): ప్రజలకు సేవ చేయాలంటే పక్కనే ఉండాల్సిన అవసరం లేదు మనసులో సేవాభావం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే మంచి సంకల్పం ఉంటే ఎక్కడున్నా సహాయం చేయవచ్చని నిరూపిస్తున్నారు బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ యువ నాయకుడు, ఎన్నారై కోనేరు శశాంక్. అమెరికాలో ఉంటున్నప్పటికీ తన నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామానికి చెందిన..!!! బీజేపీ కార్యకర్త మంత్రి లింగం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయి బాధలో ఉన్న విషయం స్థానిక బీజేపీ నాయకుల ద్వారా తెలుసుకున్న కోనేరు శశాంక్ వెంటనే స్పందించారు. అమెరికాలో ఉన్నప్పటికీ బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా, మృతుడి పిల్లల చదువులు..!!!! మధ్యలో ఆగిపోకుండా భవిష్యత్తులోనూ ఎల్లవేళలా అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు పిల్లల భవిష్యత్తుపై భరోసా కల్పించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గతంలోనే బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు...!!! ఏ ఆపద వచ్చినా, ఏ కష్టం ఎదురైనా మీకు అండగా నేనున్నానని కోనేరు శశాంక్ భరోసా ఇచ్చారు. ఇప్పుడు అదే మాటను చేతల్లో చూపిస్తూ మరోసారి తన సహృదయతను చాటుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు విషయం తెలియజేయడమే ఆలస్యం.. బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు రావడం ఆయనకు ప్రజల పట్ల ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తోంది.

అమెరికాలో ఉన్నా.. మన ఊరి ప్రజల కష్టాలు మరవని మనసు: ఒక కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు వారికి ధైర్యం చెప్పడం, ఆర్థికంగా చేయూతనివ్వడం, ముఖ్యంగా పిల్లల చదువులకు భరోసా కల్పించడం ఎంతో విలువైన విషయం. పదవులు, హోదాలు, ప్రాంతాలకు అతీతంగా మానవత్వంతో స్పందించడం ద్వారా కోనేరు శశాంక్ ఆ కుటుంబానికి పెద్దన్నలా అండగా నిలిచారు. ఆయన అందించిన సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనివ్వడమే కాకుండా, పిల్లల భవిష్యత్తుపై కొత్త ఆశను కల్పించింది. ఈ కార్యక్రమంలో ఇందూరు జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు..!!!! రామరాజు, రుద్రూర్ మండల బీజేపీ సీనియర్ నాయకులు పార్వతి మురళి, అంబం బీజేపీ సర్పంచ్ గంగాధర్, రేపల్లె సాయిప్రసాద్, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షులు ఏముల నవీన్, బడే రాము, అసం రాము, కమ్మరి లక్ష్మణ్ తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని..!!! ఆదుకోవడంతో పాటు పిల్లల చదువులకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన కోనేరు శశాంక్కు గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికాలో ఉన్నా తన నియోజకవర్గ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



పటేల్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

- రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా మెదక్‌లో రన్ ఫర్ యూనిటీ.
- 2కే రన్‌ను ప్రారంభించి, స్వయంగా పాల్గొన్న అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(జన సంఘర్షణ) : దేశ ఐక్యత,సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి,రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా శనివారం మెదక్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. బోధన్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు రన్ కొనసాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ1875 అక్టోబర్ 31న గుజరాత్‌లో జన్మించిన పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా విశేష సేవలందించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం 560కి పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని తెలిపారు. ఆయన దూరదృష్టి, దృఢ సంకల్పం, నాయకత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు. భాష,మతం,ప్రాంతాలకు అతీతంగా భారతీయులమనే భావనతో ఐకమత్యంగా మెలగాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సోదరభావాన్ని అలవర్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డీఎస్పీ రంగనాథ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి,ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్,ఎస్సైలు, అగ్నివీర్ అభ్యర్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీఎంఆర్ కుంభకోణంపై సీఐడీ ఉక్కుపాదం

- ఒకవైపు పరారీలో ఉన్న మిల్లర్ల కోసం వేట.. మరోవైపు అరెస్టయిన వారికి కస్టడీ విచారణ
- రూ.242 కోట్ల బియ్యం వ్యవహారంలో కీలక మలుపు.. నిజామాబాద్ జిల్లాలో ఆరు రైస్ మిల్లులపై ప్రత్యేక దృష్టి



నిజామాబాద్, ఉమ్మడి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంపై సీఐడీ అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. సన్న వడ్ల సేకరణ నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగింత వరకు జరిగిన వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రభుత్వానికి సుమారు రూ.242 కోట్ల మేర నష్టం కలిగించినట్లు ఆరోపణలు రావడంతో ఈ కేసును అధికారులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. ఈ కేసులో మొత్తం 16 మంది రైస్ మిల్లర్లపై కేసులు నమోదు కాగా, 14 మందిని అరెస్టు చేసినట్లు సమాచారం..!!!!. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు మిల్లర్లు కోర్టును ఆశ్రయించి బెయిల్ పొందినట్లు సమాచారం. రిమాండ్‌లో ఉన్న 14 మంది నిందితులను మరింత లోతుగా విచారించేందుకు సీఐడీ అధికారులు కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో శుక్ర, శనివారాల్లో కస్టడీ విచారణ చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

పరారీలో ఉన్నవారికి తప్పని సీఐడీ వేట : కేసులో భాగస్వాములుగా ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు రైస్ మిల్లుల పార్టనర్లు ఇంకా పోలీసులకు చిక్కకపోవడంతో వారి కోసం ప్రత్యేక గాలింపు చేపట్టారు. సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు శుక్రవారం నుంచి రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఒకవైపు పరారీలో ఉన్నవారి కోసం వేట కొనసాగిస్తూనే, మరోవైపు అరెస్టయిన నిందితులను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

నిజామాబాద్ జిల్లాలో ఆరు మిల్లులపై దర్యాప్తు : రాష్ట్రవ్యాప్తంగా 16 రైస్ మిల్లులకు సంబంధించిన రూ.242 కోట్ల విలువైన బియ్యం వ్యవహారంలో పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ ఫిర్యాదు మేరకు సీఐడీ కేసులు నమోదు చేసింది. నిజామాబాద్, కరీంనగర్, ములుగు, మిర్యాలగూడ ప్రాంతాలకు చెందిన మిల్లర్లపై దర్యాప్తు కొనసాగుతోంది. వీటిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆరు రైస్ మిల్లులు ఉండటం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాకు చెందిన నలుగురు మిల్లుల యజమానులు అరెస్టు కాగా, వారి భాగస్వాములు కొందరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

కస్టడీ విచారణలో అసలు గుట్టు బయటపడుతుందా : సన్న వడ్లను సేకరించిన తర్వాత వాటిని ఏం చేశారు? ఎక్కడికి తరలించారు? విక్రయించారా? ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని ఎలా పక్కదారి పట్టించారు? సన్న బియ్యానికి బదులుగా దొడ్డు బియ్యం సరఫరా చేయడం వెనుక ఎవరెవరి పాత్ర ఉంది? ఈ వ్యవహారంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు ఏమిటి? అనే అంశాలపై సీఐడీ అధికారులు నిందితులను ప్రశ్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ వ్యవహారంలో మిల్లర్లతో పాటు..!! భాగస్వాములు, ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా? ప్రభుత్వానికి సంబంధించిన బియ్యం నిల్వలు ఎలా మళ్లించబడ్డాయి? అనే అంశాలపై విచారణలో స్పష్టత వచ్చే అవకాశముంది.

రూ.242 కోట్ల వ్యవహారం.. దర్యాప్తుపై సర్వత్రా ఆసక్తి : ఇప్పటికే పలువురు మిల్లర్లు అరెస్టు కావడం, మరికొందరు పరారీలో ఉండటం, రిమాండ్‌లో ఉన్న నిందితులపై కస్టడీ విచారణ ప్రారంభం కావడంతో సీఎంఆర్ వ్యవహారం మరో కీలక దశకు చేరుకుంది. ఒకవైపు పరారీలో ఉన్నవారి కోసం గాలింపు.. మరోవైపు అరెస్టయిన వారిని ప్రశ్నించడం.. ఇలా రెండు కోణాల్లో సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు ఎవరెవరి పాత్రను బయటపెడతాయోనన్న ఆసక్తి నెలకొంది.

సరూర్‌నగర్‌లో అక్రమ అండాల సేకరణ దందా కలకలం

- కాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులే లక్ష్యం.. 18 మంది యువతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- డబ్బుల ఆశ చూపి ఇంజెక్షన్లతో అండాల సేకరణకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు.. ఐవీఎఫ్ కేంద్రాలకు సరఫరాపై దర్యాప్తు.



హైదరాబాద్, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): హైదరాబాద్ మహానగరంలో అక్రమ అండాల సేకరణ వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో వెలుగుచూసిన ఘటనలు మరువకముందే తాజాగా సరూర్‌నగర్‌లో మరో అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులను లక్ష్యంగా చేసుకుని డబ్బుల ఆశ చూపి అండాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

నివాస గృహంపై పోలీసుల ఆకస్మిక దాడులు : సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ నివాసంలో అక్రమంగా అండాల సేకరణ జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. యువతుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని నమ్మించి ఈ కార్యకలాపాల్లోకి తీసుకొస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంజెక్షన్లతో అండాల సేకరణ.. ఐవీఎఫ్ కేంద్రాలకు సరఫరా : యువతులకు ప్రత్యేక ఇంజెక్షన్లు ఇచ్చి అండాలను సేకరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సేకరించిన అండాలను నగరంలోని కొన్ని ఐవీఎఫ్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారనే అనుమానాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం వెనుక ప్రధాన సూత్రధారులు ఎవరు? యువతులను ఎవరు తీసుకొస్తున్నారు? అండాల సేకరణ, సరఫరాలో ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది.

బేగంపేట, ప్రకాష్‌నగర్ ఘటనలతో మరింత ఆందోళన : ఇటీవల బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లోని యువతుల హాస్టళ్లపై పోలీసులు దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి యువతులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి అక్రమంగా అండాలను సేకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. వరుసగా ఇలాంటి ఘటనలు బయటపడుతున్న నేపథ్యంలో యువతుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

యువతుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నదెవరు : వైద్యుల పర్యవేక్షణ, తగిన ఆరోగ్య పరీక్షలు, చట్టబద్ధమైన అనుమతులు లేకుండా అండాల సేకరణ చేపడితే యువతుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని యువతులను అక్రమ కార్యకలాపాల్లోకి దింపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మధ్యవర్తులు, నిర్వాహకులు,..!! వైద్య సంబంధిత వ్యక్తులు లేదా సంస్థల ప్రమేయం ఉందా అనే విషయాలను సమగ్రంగా విచారించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అదుపులోకి తీసుకున్న యువతులు ఈ వ్యవహారంలో బాధితులా, ఇతరుల ప్రమేయం ఎంతవరకు ఉందనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారులు హెచ్చరికంగా లెన్స్ తగ్గించి వార్త ఇవ్వబడును తప్పులేకుండగా

సీఎంఆర్ బకాయిల వసూళ్లపై పౌరసరఫరాల శాఖ కొరడా

- డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు 45 రోజుల గడువు.!!!!
- మిల్లుల వారీగా రోజువారీ లక్ష్యాలు నిర్దేశించిన జాయింట్ కమిషనర్ కె. మనోహర్ కుమార్ రాథోడ్..!!!

మహబూబాబాద్, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిల వసూళ్లపై పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టి సారించారు. సీఎంఆర్ బియ్యం సకాలంలో ప్రభుత్వానికి అందించాలని, బకాయిల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని రైస్ మిల్లర్లను హెచ్చరించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ సమావేశం..!! మందిరంలో పౌరసరఫరాల శాఖ జాయింట్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కె. మనోహర్ కుమార్ రాథోడ్ జిల్లా రైస్ మిల్లర్లు, డిఫాల్ట్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రైస్ మిల్లుకు రోజువారీ సీఎంఆర్..!!! బియ్యం సరఫరా లక్ష్యాలను నిర్దేశించారు. డిఫాల్ట్ మిల్లర్లు తమ పెండింగ్ సీఎంఆర్ బకాయిలను 45 రోజుల్లోగా చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన



గడువులోగా బకాయిలు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ....!!లికె. అనిల్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి జె. రమేష్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ మనోజ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ (పౌరసరఫరాలు) తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ.

- సంక్షేమం,అభివృద్ధికి మారుపేరు ఇందిర పాలన.
- ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పాలన.

నీలం మధు ముదిరాజ్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : తన పరిపాలన దక్షతతో భారత దేశ ఉక్కుమహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని చిట్కుల్ లోని ఆయన నివాసంలో, దేశ ప్రజలకు ఆమె అందించిన సంక్షేమాని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని వివరించారు.

తొట్టెల వేడుకల్లో పాల్గొన్న మాజీ ఉపసభాపతి పద్మ దేవేందర్ రెడ్డి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ): మెదక్ జిల్లా పాపన్నపేట మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలీస్ వెంకట్రాంరెడ్డి మనుమడి తొట్టెల వేడుకలు ఏడుపాయల్లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ వేడుకల్లో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్,లింగారెడ్డి, శ్రీనాథ్ రావు, నాయకులు గడిల శ్రీనివాస్ రెడ్డి, పాశం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగానే చూస్తోంది

- నాలుగేళ్లుగా అర్సపల్లి ఆర్వోబీకి భూసేకరణ చేయలేదు.. బోధన్ నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రభుత్వం చేతులెత్తేసింది.
- అర్సపల్లి ఆర్వోబీ పనులను పరిశీలించిన ఎంపీ ధర్మపురి అర్వింద్.



నిజామాబాద్, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): మైనార్టీలను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఎన్నికల సమయంలో మైనార్టీల ఓట్ల కోసం హామీలు ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం, వారి అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. నిజామాబాద్‌లోని అర్సపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులను ఎంపీ అర్వింద్ ధర్మపురి పరిశీలించారు..!!!. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా అర్సపల్లి ఆర్వోబీకి అవసరమైన భూసేకరణ చేపట్టకపోవడంపై ప్రశ్నించారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని నిలదీశారు. మరోవైపు బోధన్‌లో నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు..!! ప్రభుత్వంలో లేవని, నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టలేమని మంత్రి సుదర్శన్ రెడ్డి చేతులెత్తేశారని ఎంపీ విమర్శించారు. ప్రజలకు అవసరమైన..!!! మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. అర్సపల్లి ఆర్వోబీ భూసేకరణ, బోధన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం

- ధర్వల్లిలో యజమానులకు నోటీసులు జారీ.
- పర్యావరణ పరిరక్షణకు అధికారుల చర్యలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు.



ధర్వల్లి, నిజామాబాద్ జిల్లా (జన సంఘర్షణ): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ధర్వల్లి గ్రామంలోని అన్ని ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని అధికారులు నిషేధించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బీఎం) 2026 నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు..!!! శనివారం గ్రామంలోని ఫంక్షన్ హాళ్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. వివాహాలు, ఇతర శుభకార్యాలు, వేడుకల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా..!!! ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో..!!! సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ నిఘా 75 మందికి కౌన్సెలింగ్.

- అక్టోబర్‌లో 54 అవగాహన కార్యక్రమాలు.
- 2 ఈ-పెట్టి కేసులు నమోదు.
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. మెదక్, తూప్రాన్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో సంబంధిత డీఎస్పీల పర్యవేక్షణలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.అక్టోబర్ నెలలో జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, వేధింపుల నివారణ, సైబర్ నేరాలపై 54 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న 75 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, 2 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళలను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మోటకొండూరులో ఇందిరాగాంధీకి ఘన నివాళులు



యాదాద్రి భువనగిరి జిల్లా- మోటకొండూరు/అక్టోబర్ 31(జన సంఘర్షణ): మోటకొండూర్ మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కరుని రఘునాథరాజు, బుగ్గ కొమురయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇందిరాగాంధీ దేశానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : మెదక్ జిల్లా రథసారథి వల్దాస్ మల్లేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో జిల్లా ఆఫీసులో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ఆయన ఫోటోకి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి కర్ణం ప్రణీత విచ్చేశారు.మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు చోరీ అంటుంది ఆ రోజు పటేల్ కి 12 ఓట్లు నెహ్రూ కి ఒక్క ఓటు వచ్చిన దేశ ప్రధాని గా అవకాశం ఉన్న గాంధీ గారికి విలువ ఇచి పదవి కోసం కాకుండా దేశ ప్రగతి కోసం పని చేసిన మహనీయువులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు..ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్,స్పోక్ మల్లారెడ్డి,జ్ఞాన్ సింగ్, శైలజ గౌడ్,మనోజ్ కుమార్,కరీం, సౌజన్య,గడ్డం కాశీనాథ్, ఎంఎల్ఎన్ రెడ్డి,నల్లాల విజయ్,గోవింద్,బిక్షపతి,మధ, శ్రీనివాస్,పాల్గొన్నారు.

దేశ ఐక్యత, సమగ్రత,భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ .మాట్లాడుతూ, దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు, కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి రమేష్ , ఏ,వో యూనస్ ,సంబంధిత అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరిలో ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

- కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు కొనసాగించాలి..!!!

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం ఏఐటీయూసీ జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో నాయకులు కార్మికుల హక్కులు, ప్రస్తుత కార్మిక చట్టాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా..!! పి. సుధాకర్, సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అంబాటి విట్టల్ గౌడ్ మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏర్పాటైన ఏఐటీయూసీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, కార్మిక హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక హక్కులకు నష్టం కలిగిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి..!!!



నల్ల గంగాధర్, సీపీఐ పోతంగల్ మండల కార్యదర్శి కొట్టే ప్రసాద్, బర్ల సునీల్ కుమార్, మేస్త్రీ యూనియన్ నాయకులు నీలి శంకర్, దుధ్య నాయక్, సోమ వీరేశం, శివరాజ్, పోశెట్టి, సాయిలు, రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల జాప్యంపై ఎంపీ అర్వింద్ ఫైర్!

- అసంపూర్తి సమాచారంతో వస్తే ఊరుకునేది లేదు.. ఫిబ్రవరిలోగా పనులు పూర్తి చేయాలి
- నాణ్యతలో రాజీ వద్దు.. ప్రోటోకాల్ పాటించాలని అధికారులకు ప్రజాప్రతినిధుల సూచన



నిజామాబాద్, ఉమ్మడి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): నిజామాబాద్ నగరంలో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనుల్లో జాప్యంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన దిశ సమావేశంలో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు అసంపూర్తి సమాచారంతో సమావేశానికి రావడంపై అసహనం వ్యక్తం చేసిన ఎంపీ, ప్రతి పనికి సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలని, స్పష్టమైన సమాచారం అందించాలని ఆదేశించారు. ఆగస్టులోగా పూర్తి కావాల్సిన యూజీడీ పనులు ఆలస్యమయ్యాయని అధికారులు వివరించగా, వచ్చే ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇకపై జాప్యం చేయకుండా పనులు వేగవంతం చేయాలని ఎంపీ స్పష్టం చేశారు. యూజీడీ పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. మరోవైపు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు వేదిక కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్వో గీత, మేయర్ ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

- నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు, విద్యార్థుల విద్యాభ్యాసం, కుటుంబ వ్యవస్థ మరియు సమాజంపై తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలలనీ,మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ మరియు పునరావాస సహాయం అందించాలన్నారు. పిల్లలు, కౌమారదశ యువతలో మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన కల్పించాలినీ,ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ అహ్మద్ , మున్సిపల్ కమీషనర్ నవీన్ ణజ=దీ ణ్ూూా వెంకటేశ్వర రావు, ణవీనూ జ్ఞానేశ్వర్, ణ×జూూ మాధవి, శ్రీనివాస్ రావు ూూణ,ణజూూ,జణ్ూూ లు, హుస్సేన్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, ూూ=జూూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సునీత రాకేష్ ×=జూూ ఎ×ూూ×రాచీ చీ+ూూ ప్రతినిధి ఆభరణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే శాఖ తీరుపై ప్రజాగ్రహం.. పట్టాలపైకి జనం

- చటాన్‌పల్లి గేట్ వద్ద రైలును నిలిపివేసి నిరసన
- ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు చేపడతారు? ఎన్నాళ్లో కష్టాలంటూ అధికారులకు హెచ్చరిక



షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా/అక్టోబర్ 31 (జన సంఘర్షణ): చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ప్రజల సహనం నశించింది. నిత్యం గేట్ మూసివేతతో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఆందోళనకు దిగారు. రైల్వే పట్టాలపైకి చేరుకుని రైలును నిలిపివేసి నిరసన తెలిపారు. ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా..!!! అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, అత్యవసర పనులపై వెళ్లేవారు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవర్ బ్రిడ్జి ఎప్పుడు నిర్మిస్తారు..!!? ప్రజల కష్టాలు ఇంకెన్నాళ్లు? అంటూ రైల్వే అధికారులను నిలదీశారు. స్టేషన్ మాస్టర్ వెంటనే రావాలని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నినాదాలు చేశారు.ఎఇప్పటికైనా రైల్వే శాఖ నిర్లక్ష్యాన్ని..!! వీడి చటాన్‌పల్లి వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

అనాథాశ్రమంలో హర్షిణి జన్మదిన వేడుకలు

చిన్నారుల మధ్య ఆనందాల వెల్లువ!

- పుట్టినరోజు వేడుకలను అనాథ పిల్లలతో పంచుకున్న సీనియర్ రిపోర్టర్ రాము కుటుంబం
- కేక్ కట్ చేసి పండ్లు, మిఠాయిల పంపిణీ.. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఆదర్శ వేడుక

కోటగిరి, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): పుట్టినరోజు వేడుకలు అంటే కేవలం కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంబరాలు చేసుకోవడమే కాదు.. మన ఆనందాన్ని నలుగురితో పంచుకుంటూ, ఆప్యాయతకు దూరంగా ఉన్న చిన్నారుల జీవితాల్లో సంతోషాన్ని నింపడమే అసలైన వేడుక అని నిరూపించారు సీనియర్ రిపోర్టర్ రాము కుటుంబ సభ్యులు. తన కుమార్తె హర్షిణి జన్మదినాన్ని అనాథాశ్రమంలోని చిన్నారుల మధ్య జరుపుకోవడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారు. కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలోని గుమ్మడి ఫౌండేషన్ అనాథాశ్రమంలో హర్షిణి పుట్టినరోజు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సమక్షంలో హర్షిణి కేక్ కట్ చేసి తన జన్మదిన సంతోషాన్ని అందరితో పంచుకుంది. ఆశ్రమంలోని పిల్లలందరికీ పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి, వారితో కలిసి కూర్చుని భోజనం చేయడం వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


ఆనందాన్ని పంచుకుంటేనే పుట్టినరోజుకు నిజమైన అర్థం : ఈ సందర్భంగా సీనియర్ రిపోర్టర్ రాము మాట్లాడుతూ.. తన కుమార్తె పుట్టినరోజును అనాథాశ్రమంలోని చిన్నారుల మధ్య జరుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని, మనసుకు తృప్తిని ఇచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో పుట్టినరోజు ఒక ప్రత్యేకమైన సందర్భమని, ఆ రోజున తమ సంతోషాన్ని అవసరంలో ఉన్నవారితో పంచుకుంటే ఆ ఆనందం మరింత రెట్టింపు అవుతుందని అన్నారు. పిల్లలందరూ ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంతలో అనాథ పిల్లలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అమ్మానాన్నలు లేకపోయినా.. మీలాంటి ఆప్యాయత మా అదృష్టం : హర్షిణి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఆశ్రమ చిన్నారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తమకు అమ్మానాన్నలు లేకపోయినా, తమ మధ్యకు వచ్చి అక్కలా ఆప్యాయతను పంచుకుంటూ పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. హర్షిణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె జీవితంలో మరెన్నో పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుక చిన్నారులకు కేవలం ఒక పుట్టినరోజు సంబరం మాత్రమే కాకుండా, కుటుంబ అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను అనుభవించే మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. లిమానవత్వమే నిజమైన సంపద.. మన సంతోషంలో మరొకరికి చోటు కల్పించడమే గొప్ప సంస్కారం!లి తమ ఇంటి వేడుకను అనాథాశ్రమంలోని పిల్లల మధ్య నిర్వహించి, వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించిన రాము కుటుంబం నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఖర్చుతో కూడిన వేడుకలకంటే ప్రేమను పంచే వేడుకలే జీవితాంతం గుర్తుండిపోతాయని ఈ జన్మదిన వేడుక చాటిచెప్పింది.





కోటగిరిలో మండల సర్వసభ్య సమావేశం

- **మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి -యాలి..!!!**
- **సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యం: ఎంపీడీవో జి. విష్ణు...!!!!**



, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోటగిరి ఎంపీడీవో జి. విష్ణు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధి!!!, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు తీసుకోవాలి : రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, గ్రామాల్లో తాగునీటి లభ్యత, నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చర్చించారు. మత్స్య, ఆబ్కారీ, అటవీ, హాస్టల్ సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమం, నీటిపారుదల, రోడ్లు భవనాలు తదితర శాఖల పనితీరుపైనా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మండల సర్పంచుల ఫోరం కన్వీనర్..!!! బర్ల మధుకర్, తహసీల్దార్ కె. గంగాధర్, ఎంఈఓ ఎన్. శ్రీనివాస్ రావు, ఏఓ టి. రాజు, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, విద్యుత్ ఏఈ బుచ్చిబాబు, ఏపీఎం భాస్కర్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ నరహరి, హౌసింగ్ ఏఈ ఆదర్శ్ గౌడ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్, పీఆర్ ఏఈ నవదీష్ గౌడ్, ఇన్‌చార్జి ఎంపీఓ అరవింద్ కుమార్, ఏపీఓతో పాటు మండల పరిధిలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి,!!!!లిప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో స్పష్టం చేశారు.

బాన్సువాడ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి!

- **రైతుల కష్టాలను గుర్తించి తక్షణమే ఆదుకోవాలి**
- **కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విక్టర్‌కు రైతు ప్రతినిధుల వినతిపత్రం**



నిజామాబాద్, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): బాన్సువాడ నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షాలు సకాలంలో కురవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలిసి రైతు..!!!! ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని రైతుల పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి, కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించాలని కోరారు. వర్షాభావంతో పంటల సాగు, దిగుబడులపై ప్రభావం పడుతోందని, పెట్టుబడులు పెట్టిన రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని రైతు ప్రతినిధులు కోరారు.

అనుమతులు లేకుండా టాలెంట్ టెస్టుల నిర్వహణకు యత్నం.. చర్యలు తీసుకోవాలి.

రిసోనెన్స్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై ఏబీవీపీ ఫిర్యాదు..



నిజామాబాద్, ఉమ్మడి జిల్లా బ్యూరో అక్టోబర్ 31 (జన సంఘర్షణ): విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే రిసోనెన్స్ జూనియర్ కళాశాల పేరుతో టాలెంట్ టెస్టులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్ సింగ్, డేటా ఆపరేటర్ హర్షితకు మరోసారి ఫిర్యాదు చేశారు. 2027--28 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల పేరుతో..!!!! ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరిస్తూ, ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టాలెంట్ టెస్టు నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసిందని జ్వాల ఆరోపించారు. సుభాష్‌నగర్‌లోని ఓ ప్రైవేటు భవనంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారని, ఆ భవనానికి విద్యాశాఖ నుంచి అనుమతులు లేవని తెలిపారు. ఈ సంస్థకు విద్యాశాఖ అనుమతులు..!!! లేవని, విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఇప్పటికే పత్రికా ప్రకటన విడుదల చేసిన విషయాన్ని జ్వాల గుర్తుచేశారు. అయినప్పటికీ యాజమాన్యం టాలెంట్ టెస్టుల పేరుతో విద్యార్థుల వివరాలు సేకరించేందుకు ప్రయత్నించడం ఆందోళనకరమన్నారు. అనుమతులు..!!! లేని సంస్థను నమ్మి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటే వారి విద్యా సంవత్సరం, చెల్లించిన ఫీజులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆదివారం నిర్వహించనున్న టాలెంట్ టెస్టును నిలిపివేయడంతో పాటు, అనుమతులు లేకుండా విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న యాజమాన్యంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరఫున డిమాండ్ చేశారు.

జన సంఘర్షణ ఎఫెక్ట్.. కదిలిన మిషన్ భగీరథ అధికారుల యంత్రాంగం



పోతంగల్‌లో తాగునీటి సమస్యపై వార్తా కథనానికి స్పందన.. మరమ్మతులు చేపట్టిన అధికారులు..!!!!

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31 (జన సంఘర్షణ): పోతంగల్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జన సంఘర్షణ దినపత్రిక అక్టోబర్ 29న ప్రచురించిన కథనంలో వెలుగులోకి తెచ్చింది. ఈ వార్తకు స్పందించిన అధికారులు మరుసటి రోజే క్షేత్రస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టారు. తాగునీటి సరఫరా ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా..!! మారడం, మురుగునీరు నిలిచిపోవడం, క్రిమికీటకాలు కనిపించడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి నాణ్యతపై అనుమానాలతో కొందరు గ్రామస్తులు నీటిని కొనుగోలు చేసుకుంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరిన విషయాన్ని వార్తా కథనంలో ప్రస్తావించాం. వార్త ప్రచురితమైన అనంతరం మిషన్ భగీరథ అధికారులు స్పందించి..!!! మరమ్మతులు చేపట్టడంతో గ్రామస్తులకు కొంత ఊరట లభించింది. ప్రజా సమస్యను వార్తా కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందన రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తాగునీటి నాణ్యతను పరీక్షించి, డ్రైనేజీ వ్యవస్థను..!!!! పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యలే మా ప్రాధాన్యం...!!!. ప్రజల గొంతుకగా జన సంఘర్షణ అక్షర పోరాటం!



దంపతులపై దాడి.. ఇద్దరు నిందితుల అరెస్ట్

ఆటో చోరీ గుట్టురట్టు.. చోరీ చేసిన ఆటో, దాడికి ఉపయోగించిన రాడ్ స్వాధీనం..!!!



నిజామాబాద్, ఉమ్మడి జిల్లా బ్యూరో అక్టోబర్ 31/(జన సంఘర్షణ): బైక్‌పై వెళ్తున్న దంపతులపై దాడికి పాల్పడిన ఇద్దరిని నిజామాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో చోరీ చేసిన ఆటో వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం..!!!లిచోరీ చేసిన ఆటోలో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను బైక్‌పై వెళ్తున్న దంపతులు మెల్లగా వెళ్లాలని సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు దంపతులపై రాడ్‌తో దాడి చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన..!!! నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన ఆటోతో పాటు దాడికి ఉపయోగించిన రాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం కొవ్వొత్తుల ర్యాలీ

- **బాన్సువాడలో అమర పోలీసులకు ఘన నివాళి..!!!**
- **డీఎస్పీ విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ.. పాల్గొన్న పోలీసులు, యువత..!!!**



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ బాన్సువాడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా..!!! శనివారం సాయంత్రం డీఎస్పీ విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఈ ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తులు చేతబట్టి అమర పోలీసులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..!!!! అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో..!!! పోలీసు సిబ్బందితో పాటు యువత పాల్గొని అమర పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు.

ఇస్రో పర్యటనకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు అవకాశం


- **పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపితే శ్రీహరికోట సందర్శన!!!**
- **బాన్సువాడలో విద్యార్థినులతో ఆర్డీఓ, ఎంఈఓ ముఖాముఖి!!!**



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న బాలికల్లో శాస్త్రసాంకేతిక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ఇస్రో సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) సందర్శించే అరుదైన అవకాశం లభించనుంది. ఈ కార్యక్రమంపై..!! బాన్సువాడలో విద్యార్థినులతో ఆర్డీఓ, మండల విద్యాధికారి (ఎంఈఓ) ముఖాముఖి నిర్వహించి పర్యటన వివరాలు, పోటీ పరీక్ష ప్రాధాన్యతను వివరించినట్లు సమాచారం. పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన బాలికలను..!!! ఎంపిక చేసి శ్రీహరికోటకు తీసుకెళ్లనున్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో ప్రతిభ కనబరచాలని అధికారులు సూచించారు. ఇస్రో సందర్శన ద్వారా అంతరిక్ష..!! పరిశోధనలు, శాస్త్రసాంకేతిక అభివృద్ధిపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు విద్యార్థినులకు అవకాశం కలగనుంది.

మోరీల్ శ్రీనివాస్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని డాక్టర్ ఎంఏ హకీమ్ ఆకాంక్ష..!!!





నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31/ (జన సంఘర్షణ): మోరీల్ శ్రీనివాస్, వారి సతీమణి వివాహ వార్షికోత్సవం సందర్భంగా పోతంగల్ మండల పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, సామాజిక సేవకులు డాక్టర్ ఎంఏ హకీమ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ...!!!! వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ప్రేమానురాగాలు, సుఖసంతోషాలతో నిండి ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. జీవితంలో ఎన్నో వసంతాలు కలిసి ఆనందంగా గడుపుతూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా...!!! డాక్టర్ ఎంఏ హకీమ్ తెలిపిన శుభాకాంక్షల పట్ల మోరీల్ శ్రీనివాస్ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

కోటగిరి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

ఎదురెదురుగా ఢీకొన్న కారు, బైక్.. ఇద్దరు మహిళా, పురుష కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు!!!



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31 (జన సంఘర్షణ): కోటగిరి నుంచి సులేమాన్ ఫారం వెళ్లే రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..!!! కోటగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు అనురాధ, శంకర్ తోటి సిబ్బందితో కలిసి ద్విచక్రవాహనంపై బోధన్ వైపు విధులకు వెళ్లుండగా, ఎదురుగా వచ్చిన కారు (టీఎస్10 డీజ 1961) వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ రహదారి పక్కకు పడిపోవడంతో కాళ్లకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన..!! స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు పోలీసుల విచారణ .!!!"లిఅనంతరం తెలియాల్సి ఉంది.

ఎల్‌నినో ప్రభావం.. యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం.. నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి: ఏఓ నిషిత!!!!



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి పంటల సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి (ఏఓ) నిషిత సూచించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె రైతులకు సూచించారు. తిర్మలాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో..!!! రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏఓ నిషిత మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా నీటి కొరత ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో..!!!! గ్రామ సర్పంచ్ బోయి సైదవ్వ, ఎంపీడీఓ చందర్, ఏఈఓ శంకర్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో దారుణం.. ఇద్దరు పదో తరగతి విద్యార్థినులపై కత్తిరింపు రంపంతో దాడి.

ముఖం, చేతులు, కాళ్లపై తీవ్ర గాయాలు.. గోపిక పరిస్థితి విషమం..!!!



అనంతపురం, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): అనంతపురం జిల్లాలో శనివారం అమానుష ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలోకి ప్రవేశించిన ఓ వ్యక్తి కత్తిరింపు రంపంతో ఇద్దరు పదో తరగతి విద్యార్థినులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు బాలికలు తీవ్రంగా గాయపడ్డారు. అందిన సమాచారం ప్రకారం....;!!; నిందితుడు ఓ విద్యార్థినిపై ముఖం, చేతులు, కాళ్లపై రంపంతో దాడి చేయగా, పక్కనే ఉన్న మరో విద్యార్థినిపై కూడా దాడి చేశాడు. ఈ ఘటనలో గోపిక అనే విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరో విద్యార్థినికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనతో విద్యార్థులు,...!; ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దాడికి గల కారణాలు, నిందితుడి వివరాలు, పోలీసుల తదుపరి చర్యలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

మానవీయత చాటుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

ఆయన బిడ్డ కాదు.. నా బిడ్డ" అంటూ బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచన..!!!



:హైదరాబాద్ ఆస్పత్రిలో జుబేర్ కుమారుడికి పరామర్శ

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): మైనార్టీ యువ నాయకుడు జుబేర్ కుమారుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు...!!!. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. "ఆయన బిడ్డ కాదు.. నా బిడ్డ" అంటూ బాలుడి పట్ల తన ఆప్యాయతను చాటుకున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై మరోసారి వైద్యులతో చర్చించి, అవసరమైన మెరుగైన వైద్యం త్వరితగతిన అందించాలని కోరారు. అనంతరం జుబేర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ..!!!!, బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో అండగా నిలిచి, తమకు మనోధైర్యం కల్పించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి జుబేర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెదక్‌ను కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే!

- రైతుల కష్టాలు కనిపించడం లేదు
- గ్రామం యూనిట్‌గా పంట నష్టాన్ని అంచనా వేయాలి
- కరువు నిర్ధారణలో శాస్త్రీయ విధానాలు పాటించాలి
- మంజీరా జలాలపై మెదక్ రైతులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి
- కరువు జిల్లా ప్రకటించకుంటే దశలవారీ ఉద్యమం
- రౌండ్ టేబుల్ సమావేశం లో వక్తలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (జన సంఘర్షణ) : మెదక్ జిల్లాలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, వర్షాభావం, పంటల నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మెదక్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై మెదక్ సిటీజన్స్ ఫోరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్143),తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ)రైతు స్వరాజ్య వేదిక, మెదక్ స్టడీ సర్కిల్ లు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి, టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ అజయ్, సిపిఎం నేత మల్లేశం, బిఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మానవ హక్కుల వేదిక నేత హైమద్ లు మాట్లాడుతూ కరువు పరిస్థితుల నిర్ధారణలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర అసంతృప్తి గా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని కరువు పరిస్థితులను అంచనా వేయడం వల్ల వాస్తవ పంట నష్టం వెలుగులోకి రావడం లేదని వారు అభిప్రాయపడ్డారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామంలో పంటల సాగు, వర్షపాతం, దిగుబడి, నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులను నిర్ధారించే విషయంలో ప్రభుత్వ విధానాల్లో శాస్త్రీయత లోపించిందన్నారు.ఒకే మండలంలో కొన్ని గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతింటే, మరికొన్ని గ్రామాల్లో పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అలాంటప్పుడు మండలాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి కరువు తీవ్రతను నిర్ణయించడం వల్ల నష్టపోయిన రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలవారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా పంట నష్టాన్ని నిర్ధారించాలని డిమాండ్ చేశారు.జిల్లా పరిధిలో మంజీరా నది ప్రవహిస్తున్నప్పటికీ మెదక్ రైతాంగానికి సాగునీటి కష్టాలు తప్పడం లేదని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. మంజీరా జలాలను జిల్లాలోని వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ కేటాయించాలని కోరారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సాగునీటి వనరులున్న ప్రాంతంలోనే రైతులు వర్షాధార వ్యవసాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి మారాలని అభిప్రాయపడ్డారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తగిన పరిష్కారాలు లభించడం లేదని వక్తలు విమర్శించారు. పంట నష్టాలు, సాగునీటి కొరత, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేసే విధంగా ఉండాలని, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించరాదని హితవు పలికారు.మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం, కరువు సహాయక చర్యలు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు.ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకుంటే రైతులు, ప్రజాసంఘాలు, వివిధ వర్గాలను కలుపుకొని దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సమావేశంలో పాల్గొన్న వక్తలు హెచ్చరించారు. మెదక్ రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, కరువు సమస్యను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా రైతులకు ఆచరణాత్మకంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతాంగానికి సంబంధించిన 27 తీర్మాణాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మైసయ్య యాదవ్, మెదక్ సిటీజన్స్ ఫోరం నాయకులు పిడి ఆనందం, భాగయ్య, బిసి సంఘం నేత బాలరాజ్ గౌడ్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(హెచ్ 143)జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు)మెంగర్తి సుధాకర్, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి లతో పాటు ఆయా పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆశయాల సాధన కోసం ఒక్కటవుదాం.. బీఆర్ఎస్ బలోపేతానికి ముందుకు సాగుదాం

ఆదిలాబాద్ మహాసభను విజయవంతం చేద్దాం.. బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో అక్టోబర్ 31/(జన సంఘర్షణ) : ఆదిలాబాద్!!: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలను ముందుకు..!!! తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలవాలని, పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సందేశమిస్తున్నారు. మన కేసీఆర్ ఆశయాల కోసం.. మన బీఆర్ఎస్ కోసం.. ఒక్కటవుదాం...!!!! ముందుకు సాగుదాం.. అనే నినాదంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యతను చాటాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా..!!! పోతంగల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఏ. హకీం సాబ్ పేరుతో ఆదిలాబాద్ మహాసభకు సంబంధించిన పిలుపు ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాలు..!!!, కేసీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త..!!! అంకితభావంతో పనిచేయాలని, ఆదిలాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్!. బిఆర్ఎస్ పెద్దలు. అఖిము పేర్కొన్నారు



మోరీల్ శ్రీనివాస్ దంపతులకు ఘనంగా పెళ్లిరోజు శు భాకాంక్షలు.. బాన్సువాడ ప్రజల నుంచి అభినందనల వెల్లువ

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31/ (జన సంఘర్షణ): మోరీల్ శ్రీనివాస్ దంపతులు తమ వైవాహిక జీవితంలో..!!! మరో మధురమైన మైలురాయిని చేరుకున్న సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మీ దాంపత్య జీవితం ఎల్లప్పుడూ..!!!! ప్రేమ, ఆప్యాయత, ఆనందం, ఆరోగ్యం, సంతోషాలతో నిండిపోవాలని, ఇలాంటి మరెన్నో సంతోషకరమైన పెళ్లిరోజులను కలిసి జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

బాన్సువాడ రాజకీయాల్లో శ్రీనివాస్ పేరు చర్చనీయాంశం : మోరీల్ శ్రీనివాస్ రాబోయే రోజుల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని పలువురు స్థానికులు తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం, పార్టీ అధినేత కేటీఆర్ బీఫామ్ కేటాయిస్తే తప్పకుండా పోటీ చేస్తానని శ్రీనివాస్ తన అనుచరులతో చెప్పినట్లు వారు వెల్లడిస్తున్నారు.

ఫోన్ కాల్స్.. వాట్సాప్.. సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు : పెళ్లిరోజు సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గంలోని పలువురు ప్రజలు ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా శ్రీనివాస్ దంపతులకు శు భాకాంక్షలు తెలియజేశారు. మీరు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు!!!!. ప్రజల నుంచి అందుతున్న ఈ శుభాకాంక్షలతో శ్రీనివాస్ దంపతుల పెళ్లిరోజు వేడుక మరింత ప్రత్యేకంగా మారింది. మోరీల్ శ్రీనివాస్ దంపతులకు..!!! మరోసారి హృదయపూర్వక పెళ్లిరోజు శు



భాకాంక్షలు..!!బాన్సువాడ నియోజకవర్గం ప్రజలు తెలిపారు.

వక్తృత్వ పోటీలో బాన్సువాడ నర్సింగ్ విద్యార్థిని ప్రతిభ

యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో మూడో బహుమతి కైవసం..!!!

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/ అక్టోబర్ 31/(జనసంఘర్షణ) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థిని ఏంజెల్ వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరిచి మూడో బహుమతిని సాధించింది. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027 యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డిలోని ఆర్.కె. డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో ఆమె పాల్గొంది. ఈ సందర్భంగా..!! ఏంజెల్ తన ప్రసంగ పటిమతో అందరినీ ఆకట్టుకుని మూడో బహుమతిని కైవసం చేసుకుంది. యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహనను పెంపొందించడంతో పాటు వారి ఆలోచనా శక్తిని వెలికితీయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తృత్వ పోటీలో బహుమతి సాధించిన..!! ఏంజెల్‌ను పలువురు అభినందించారు. బాన్సువాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ఆమె మంచి గుర్తింపు తీసుకువచ్చింది.



స్థానిక కూటమి జడ్పిటిసి అభ్యర్థి కామసాని రామిరెడ్డి ని మరియు కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించండి

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



మార్కాపురం జన సంఘర్షణ అక్టోబర్ 31 :- మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కొనకనమిట్ల మండలంలో కూటమి జెడ్పిటిసి అభ్యర్థి కామసాని రామిరెడ్డి ని మరియు స్థానిక కూటమి ఎంపిటిసి అభ్యర్థులను గెలిపించాలని వాగమడుగు, మునగపాడు ఎంపీటీసీల ప్రాదేశికాల పరిధిలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వాగమడుగు గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మార్కాపురం సభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ జడ్పిటిసి అభ్యర్థి హైదరాబాదు నుంచి దిగుమతి అయ్యాడని అతనికి స్థానిక పరిస్థితులు పట్ల అవగాహన లేదు అని స్థానికుడైన మన కూటమి అభ్యర్థి కామసాని రామిరెడ్డి గారిని మరియు ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపిస్తే ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తారని అన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం అన్యాయం రాజ్యమేలాయని ఎంతసేపు బటన్ నొక్కామని వైసిపి నాయకులు అంటుంటారు అని కానీ ఒక పెన్షన్ 3000 రూపాయలు ఇవ్వడానికి 4:6 సంవత్సరాలు తీసుకున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదని అన్నారు .అమ్మఒడి పేరుతో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఇస్తామని బుటకపు టకపు వాగ్దానం చేసి ఒక్క విద్యార్థికి ఆర్థిక సహాయం పరిమితం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వాన్ని అన్నారు.మా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ గా అమలు చేస్తున్నామని ఇప్పటికే పెన్షన్ ను 4000 రూపాయలకు పెంచామని తల్లికి వందనం పేరుతో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమంది విద్యార్థులకు సంవత్సరానికి 13000 రూపాయల ఆర్థిక సహాయం చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు సంవత్సరానికి 20వేల రూపాయలు ఎకౌంట్లో జమ చేస్తున్నాము, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, సంవత్సరానికి కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు సరఫరా చేస్తున్నామని, అన్న క్యాంటీన్ పేరుతో ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని అన్నారు.గతంలో ఈ నియోజకవర్గానికి ఎవరు చేయనంతగా మన ప్రభుత్వం ప్రజలకు చేసిందని మార్కాపురం జిల్లా ఇచ్చామని, వెలుగొండ ప్రాజెక్టు సాధించామని, మునుపెన్నడూ లేని విధంగా ఇంటింటికి పైప్ లైన్ తెచ్చామని ఇది చరిత్రాత్మకమని, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు వేస్తున్నామని, హార్టికల్చర్ హబ్ ద్వారా వచ్చే మూడు సంవత్సరాల్లో మన జిల్లాకు 5 వేల కోట్ల రూపాయలు వస్తాయని తద్వారా గ్రామాల్లోని తారు రోడ్లు, కోల్డ్ స్టోరేజ్ లు, పండ్ల మొక్కలు ఇస్తామని తద్వారా రైతులు హార్టికల్చర్ హబ్ ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తారని అన్నారు.ఎప్పుడు లేని విధంగా కొనకనమిట్ల మండలంలో మూడు వేల కోట్ల రూపాయలతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.ఎప్పుడు లేనంతగా అభివృద్ధి చేస్తున్న మా కూటమి ప్రభుత్వానికి జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కామసాని రామిరెడ్డి ని, కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో వైసిపికి ఓటు వేస్తే మురిగిపోయినట్లే



మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి

మార్కాపురం జన సంఘర్షణ అక్టోబర్ 31 :- మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కొనకనమెట్ల మండలంలో జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల సందర్భంగా జడ్పిటిసి అభ్యర్థి శ్రీ కామసాని రామిరెడ్డి ని, కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని చినమన గుండం, గొట్లగట్టు, చిన్నారికట్ల ఎంపిటిసి ప్రాదేశికాల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపికి ఓటు వేస్తే మురిగిపోయినట్లేనని వారేమైనా గెలిస్తే ఒక రోడ్డు వేస్తారా,ఒక కాలువ తీస్తారా, ఊర్లో ఒక లైటు వేస్తారు లేక ఒక త్రాగునీరు ఇవ్వగలరా అందువలన వైసిపి ఓటు వేస్తే మురిగిపోయినట్లేనని అన్నారు.మా అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో అత్యంత అభివృద్ధి చేస్తామని అన్నారు.ఇప్పటికే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసాము అని, మార్కాపురం జిల్లా సాధించాము అని ప్రతి ఇంటికి త్రాగునీటి పైప్ లైన్ తో పాటు, గ్రామాల్లో సిసి రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని ఇంకా చేయవలసిన పనులు మిగిలి ఉన్నాయి కూటమి అభ్యర్థులను గెలిపించినట్లయితే గ్రామాల్లో మునుపుపెన్నడు లేనంత అభివృద్ధి చేస్తామని అన్నారు. జడ్పిటిసిగా స్థానిక కామసాని రామిరెడ్డి కావాలా లేక వైసిపి బెంగుళూరు అభ్యర్థి కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. స్థానిక అభివృద్ధి రామిరెడ్డి గెలిచినట్లయితే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తారని అన్నారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి అభ్యర్థి కామసాని రామిరెడ్డి ,కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు.

నరాజముల తండా గ్రామంలో ప్రజల మధ్యకు దూసుకెళ్లిన ఆవుల కోటి వీర రెడ్డి

పుల్లలచెరువు జన సంఘర్షణ అక్టోబర్ 31 :- పుల్లలచెరువు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి ఆవుల కోటి వీర రెడ్డి ఎన్నికల ప్రచారం చిన్న పీ ఆర్ సీ తండా గ్రామంలో ఉత్సాహంగా కొనసాగింది.గ్రామ ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్య ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, అభిమానంతో ప్రచారం మరింత జోరుగా సాగుతోంది.



ప్రజల ఆశీస్సులతో.. ఫ్యాన్ గుర్తుపై ఓటుతో అఖండ విజయం దిశగా కోటి వీరారెడ్డి ఉన్నారని విశ్వసనీయ సమాచారం.

రోడ్డు వేస్తామని తవ్వేశారు

చెన్నుపల్లి-గలిజేరుగుళ్ల రహదారిపై ప్రయాణ కష్టాలు.. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి

బేస్తవారిపేట జన సంఘర్షణ అక్టోబర్ 31 :- మంచి రోడ్డు వస్తుందని సంతోషించాల్సిన ప్రజలకు.. ప్రస్తుతం ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. మార్కాపురం జిల్లా, బేస్తవారిపేట మండలంలోని చెన్నుపల్లి నుంచి గలిజేరుగుళ్లకు వెళ్లే రహదారి పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనదారులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికుల ఆవేదన.



నెలలు గడుస్తున్నా ప్రజలకు తప్పని తిప్పలు!

అనుభవిస్తేనే తెలుస్తుంది ఆ కష్టం! : రోడ్డు మీద ప్రయాణించే వారికి ఎదురవుతున్న ఇబ్బందులను మాటల్లో చెప్పడం కష్టం. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఎక్కడ గుంత వస్తుందో, ఎక్కడ వాహనం అదుపు తప్పుతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి. ఆటోల్లో ప్రయాణించే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం పనుల నిమిత్తం ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే ప్రజలకు ఈ రహదారి ప్రయాణం భారంగా మారుతోంది. రోడ్డు పనులు పూర్తవుతాయని ఎదురుచూస్తున్న ప్రజలకు రోజులు గడుస్తున్నా కష్టాలు మాత్రం తీరడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. వాహనాలపై ప్రయాణించేవారికే కాదు, అత్యవసర పనులపై వెళ్లేవారికి కూడా ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది.

అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదా? : రోడ్డు నిర్మాణం చేపట్టడం అభినందనీయమే. కానీ పనులు ప్రారంభించిన తర్వాత వాటిని సకాలంలో పూర్తి చేయడం కూడా అంతే ముఖ్యం. రోడ్డును తవ్వి ఎక్కువకాలం అలాగే వదిలేస్తే ప్రజలు పడే ఇబ్బందులకు బాధ్యత ఎవరిది? పనుల పురోగతిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు.. ప్రజలకు ప్రయాణ శిక్షగా మారకూడదు. పనులు పూర్తయ్యే వరకు కనీసం సురక్షితమైన తాత్కాలిక ప్రయాణ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

అధికారులకు ప్రజల విజ్ఞప్తి : చెన్నుపల్లి-గలిజేరుగుళ్ల రహదారి పనులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయో పరిశీలించి, వీలైనంత త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ప్రశ్న ఒక్కటే.. : రోడ్డు బాగుపడుతుందని ఎదురుచూస్తున్నాం.. కానీ అప్పటివరకు ఈ కష్టాలు ఎన్ని రోజులు భరించాలి? అభివృద్ధి పనులు ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి తప్ప, వారి నిత్యజీవితాన్ని ఇబ్బందుల్లోకి నెట్టకూడదు. చెన్నుపల్లి--గలిజేరుగుళ్ల రహదారి పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజల ప్రయాణ కష్టాలకు ముగింపు పలకాలని సంబంధిత అధికారులు స్పందిస్తారా? అన్నది వేచి చూడాలి.

ఏప్రిల్ 1, 2027 నుంచి రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు.. ఆర్బీఐ కీలక ప్రయోగం

- **చిరిగిపోని కరెన్సీ దిశగా అడుగులు.. ఏటీఎంల సైజుల్లో మార్పులు లేకుండానే కొత్త నోట్లు!!!**
- **రూ.1000 ప్లాస్టిక్ నోట్ల ప్రచారం ఫేక్.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పష్టీకరణ!!!!**



న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (జన సంఘర్షణ): భారతీయ కరెన్సీ వ్యవస్థలో కొత్త మార్పులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) సిద్ధమవుతోంది. సాధారణ కాగితపు నోట్ల స్థానంలో మరింత మన్నిక కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. తొలివిడతలో రూ.10, రూ.20 నోట్లను పైలట్ ప్రాజెక్టు కింద చలామణిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

చిన్న నోట్లతోనే ప్రయోగాత్మక ప్రారంభం : రూ.10, రూ.20 నోట్లు నిత్యం ప్రజల చేతుల్లో ఎక్కువగా చలామణి అవుతుంటాయి. కూరగాయల మార్కెట్లు, కిరాణా దుకాణాలు, బస్సులు, ఆటో ప్రయాణాల్లో వీటి వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో త్వరగా చిరిగిపోవడం, మురికిపట్టడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కువకాలం మన్నిక ఉండే పాలిమర్ నోట్లను తీసుకురావాలని ఆర్బీఐ భావిస్తోంది.

ఏప్రిల్ 1, 2027 నుంచి పైలట్ ప్రాజెక్టు లక్ష్యం : అన్నీ అనుకున్నట్లు జరిగితే 2027 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్లాస్టిక్ నోట్ల ప్రయోగాత్మక చలామణి ప్రారంభించాలని ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. తొలివిడతలో రూ.10 విలువ కలిగిన 100 కోట్ల నోట్లు, రూ.20 విలువ కలిగిన 100 కోట్ల నోట్లు కలిపి మొత్తం 200 కోట్ల నోట్లను పరీక్షించనున్నట్లు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి.

ఏటీఎంలకు అదనపు ఖర్చు తప్పే అవకాశం : కొత్త నోట్ల పరిమాణం ప్రస్తుతం చలామణిలో ఉన్న నోట్ల సైజులోనే ఉండేలా ప్రణాళిక చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఏటీఎం యంత్రాల్లో పెద్దగా మార్పులు చేయాల్సిన అవసరం ఉండదని అంచనా. బ్యాంకులకు అదనపు ఖర్చు తగ్గే అవకాశం ఉంది.

కాగితపు నోట్లు రద్దు కావు : ప్లాస్టిక్ నోట్లు ప్రవేశపెట్టినా ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేసే ప్రతిపాదన లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త పాలిమర్ నోట్లు, పాత కాగితపు నోట్లు సమాంతరంగా చలామణిలో ఉండనున్నాయి. కొత్త నోట్ల మన్నిక, వాతావరణ పరిస్థితులకు అనుకూలత, ప్రజల వినియోగాన్ని పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.1000 ప్లాస్టిక్ నోట్ల ప్రచారం అవాస్తవం : మరోవైపు రూ.1000 విలువ కలిగిన కొత్త ప్లాస్టిక్ నోట్లు విడుదల కానున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఖండించింది. ఆర్బీఐ రూ.1000 ప్లాస్టిక్ నోట్లపై ఎలాంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించింది. మొత్తానికి..!!! చిరిగిపోవడం, మన్నిక వంటి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా పాలిమర్ కరెన్సీ ప్రయోగం చేపట్టాలని ఆర్బీఐ భావిస్తోంది. ప్రయోగ ఫలితాల ఆధారంగానే భవిష్యత్తులో మరిన్ని నిర్ణయాలు తీసుకోనుంది.

ఏత్తాండలో ఆలపాటి కసిందుల వారి నూతన వస్త్రధారణ మహోత్సవం..



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బ్యూరో/అక్టోబర్ 31/ (జన సంఘర్షణ): నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఏత్తాండ గ్రామానికి చెందిన చీ=× కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో ఆలపాటి ఁ కసిందుల వారి నూతన వస్త్రధారణ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆహ్వానం అందిస్తున్నారు. ఈ శుభకార్యానికి..!!! విచ్చేసే బంధుమిత్రులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతూ.. మీ రాకతో ఈ వేడుక మరింత ఆనందోత్సాహాలతో, ఆప్యాయతల నడుమ జరగాలని ఆకాంక్షిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు..!!! అందరూ ఈ శుభకార్యానికి విచ్చేసి వేడుకలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు. ఆలపాటి ఁ కసిందుల వారి నూతన వస్త్రధారణ!!! మహోత్సవానికి విచ్చేయు ప్రతి ఒక్కరికీ స్వాగతం.. సుస్వాగతం! ఆహ్వానితులు!!!: చీ=× కోనేరు శశాంక్ ఏత్తాండ గ్రామం, కోటగిరి మండలం, బాన్సువాడ నియోజకవర్గం.

జిల్లా స్థాయి జానపద నృత్య పోటీల్లో ఉమ్మడివరం పాఠశాలకు తృతీయ బహుమతి

విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు.. పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన చిన్నారులు

పుల్లలచెరువు జన సంఘర్షణ్)అక్టోబర్ - 31 జిల్లా స్థాయిలో నిర్వహించిన జానపద నృత్య, పాత్రధారణ పోటీల్లో పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. జాతీయ జనాభా విద్యా ప్రాజెక్టు (ఎన్పీఈపీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 30వ తేదీన మార్కాపురం జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల, మైనంపాడులో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు జానపద నృత్య విభాగంలో తృతీయ బహుమతిని సాధించి ప్రశంసలు అందుకున్నారు.ఈ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యం ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. తమ ప్రదర్శనలో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.విద్యార్థులు సాధించిన ఈ విజయంపై పుల్లలచెరువు మండల విద్యాశాఖాధికారులు వెంకట భాస్కర్, ఇందిరా ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపుల్ నాయక్‌ను, పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో కీలకమని, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను ఉమ్మడివరం గ్రామ పెద్దలు, గ్రామస్థులు అభినందించారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co